


# నేను మీ కల్వకుంట్ల తారక రామారావు

ఓటరుకు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టో



- గడపగడపకూ రామన్న సందేశం
- సంక్షేమ పథకాల కింద లబ్ధిని వివరిస్తూ లబ్ధిదారుల పేరిట కరపత్రాలు
- 'కారు గుర్తుకు ఓటేద్దాం.. అభివృద్ధి, సంక్షేమ పాలనను కొనసాగిద్దాం' అని పిలుపు

సిరిసిల్ల, నవంబర్ 14: 'గౌరవనీయులైన శంక రవ్వకు.. నేను మీ కల్వకుంట్ల తారకరామారావు'ను అంటూ బీఆర్ఎస్ వర్కింగ్, మంత్రి కేటీఆర్ దస్తూరితో ఉన్న కరపత్రాలు ఓటర్లను ఆకర్షిస్తున్నాయి. గులాబీ రంగుతో ముద్రించిన ఈ ఎన్నికల ప్రచార పత్రాలు ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేస్తున్నాయి. బ్రోచర్ మొదటి పేజీలో 'కారు గుర్తుకు ఓటేద్దాం.. అభివృద్ధిని కొనసాగిద్దాం' అంటూ సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఫొటోలు ఉండగా, వెనుక పేజీలో ఓటరు పేరుతోపాటు 'నేను మీ కల్వకుంట్ల తారకరామారావు' అంటూ మంత్రి సందేశాన్ని ముద్రించారు. వీటిని లబ్ధిదారుల ఇండ్లకు వెళ్లి బీఆర్ఎస్ నాయకులు అందిస్తున్నారు. ప్రజలు కూడా తీసుకొని సంబురపడుతున్నారు. తమ పేరుపై వచ్చిన కరపత్రాలను ఆసక్తిగా చదువుతూ, ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 'రామన్న చెప్పినదంతా నిజమే కదా' అంటూ మంత్రి కేటీఆర్‌కు జైకొడుతున్నారు. 'ఆయనకే మా మద్దతు' అని చెబుతున్నారు. వీటితో పాటు బీఆర్ఎస్ మ్యానిఫెస్టో-2023 ప్రచార పత్రాలను అందిస్తుండగా, బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి ఫలాలకు పట్టంకడుతామంటూ చర్చిస్తున్నారు.

### రైతుబంధు సాయాన్ని అందుకుందాం.. కారు గుర్తుకే ఓటేద్దాం..

ఇప్పటి వరకు నేరుగా 70లక్షల మంది రైతులకు 72వేల కోట్ల రూపాయలు అందించిన ఘనత మన బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కింది. సీజన్‌కు ముందే మీ ఖాతాల్లో జమ అవుతున్న రైతుబంధు సొమ్ము మీకు కొండంత భరోసాను అందిస్తున్నది. ఇన్ని రోజులు ఏడాదికి ₹10వేలు అందించిన ప్రభుత్వం, ఇప్పుడు ఆ పెట్టుబడి సాయాన్ని పెంచుతున్నది. మొదటి ఏడాది ₹12వేలకు పెంచి, తర్వాత ప్రతి ఏడాది దశల వారీగా పెంచుతూ మొత్తంగా ₹16వేలు ఇవ్వనున్నది. కాంగ్రెస్ జమానాలో కల్లోలంగా ఉన్న వ్యవసాయం, తెలంగాణ తెచ్చుకున్నాక.. మన కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా చేసుకున్నాక పండుగలా మారింది. ఒక్క మాటలో చెప్పాలంటే.. ఇవాళ తెలంగాణ రైతుకు.. కడుపునిండా కరెంట్.. కంటినిండా నిద్ర.. వ్యవసాయరంగంలో నలుదిశలా నవశకం ఇలాగే కొనసాగాలంటే .. మన రైతులోకమంతా ఎల్లవేళలా కేసీఆర్ గారికి అండగా ఉండాలని మనస్ఫూర్తిగా విజ్ఞప్తి చేస్తున్నా. రైతుబాంధవుడుగా కేసీఆర్‌ను ముచ్చటగా మూడోసారి ముఖ్యమంత్రి చేసుకోవడం మన రైతులందరి బాధ్యత.

**- రైతుబంధు లబ్ధిదారులకు మంత్రి కేటీఆర్ విజ్ఞప్తి**



పింఛన్ లబ్ధిదారు గోగు బాగవ్వకు కరపత్రాన్ని అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

### నిండు మనసుతో ఆశీర్వదిద్దాం

కాంగ్రెస్ పాలనలో చాలీచాలని పింఛన్లతో మీరు పడ్డ కష్టాలు నాకు ఇంకా గుర్తున్నాయి. అందుకే మన తెలంగాణ తెచ్చుకున్నాక ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్ద మనసుతో ₹200 ఉన్న పింఛన్ ఒకేసారి ఏకంగా పది రేట్లు పెంచి ₹2,016 అందిస్తున్నారు. ఒకప్పుడు పింఛన్ పైసలతో కనీసం కడుపు నింపుకోలేక, అనారోగ్యం పాలైతే గోలి మందులు కూడా కొనలేక మీరు ఎన్నోసార్లు కంటతడి పెట్టుకున్నారో నాకు తెలుసు. అందుకే మన ప్రభుత్వం ఏర్పడగానే పింఛన్లు పెద్దఎత్తున పెంచి అలాంటి దుస్థితి పూర్తిగా రూపుమాపాం. మనకు ఆత్మగౌరవం కల్పించిన, మనసున్న కేసీఆర్‌ను నిండు మనసుతో ఆశీర్వదిద్దాం.

**- మంత్రి కేటీఆర్**

### పెంచిన పింఛన్లను అందుకుందాం.. బీఆర్ఎస్‌కు అండగా ఉందాం..

ప్రభుత్వం ఆసరా పథకాన్ని సామాజిక బాధ్యతగా భావించింది. అందుకే ఇవాళ ఎంత భారమైనా.. ఒక్కనెల కూడా ఆగకుండా ఠంఛన్‌గా ప్రతినెలా పింఛన్ ఇస్తున్న ప్రభుత్వంగా దీవెనలు అందుకుంటున్నది. ఆసరా పింఛన్లతో లక్షలాది మంది లబ్ధిదారులు ఎవరిపై ఆధారపడకుండా ఆత్మగౌరవంతో తలెత్తుకుని బతుకుతున్నారు. ఎప్పుడూ ప్రజలకు మంచి చేయడంలో ముందుండే మన అధినేత, సీఎం కేసీఆర్ ₹2,016 పింఛన్‌ను దశలవారీగా ₹5,016కి పెంచాలని కీలక నిర్ణయం తీసుకున్నారు. గత రెండు అసెంబ్లీ ఎన్నికల్లో మన బీఆర్ఎస్ పార్టీకి ఎలా అండగా నిలిచారో.. అదే విధంగా ఈ సారి కూడా మన సంక్షేమ ప్రభుత్వాన్ని బీఆర్ఎస్‌ను, సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని నిండు మనసుతో ఆశీర్వదించాలని మనసారా కోరుతున్నాను. నవంబర్ 30న జరగబోతున్న అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ మన కారు గుర్తుకు ఓటేద్దాం.. మన మనసున్న ముఖ్యమంత్రి కేసీఆర్ గారిని మరోసారి గెలిపించుకుందాం.

**- ఆసరా పింఛన్ దారులకు మంత్రి కేటీఆర్ విజ్ఞప్తి**



### రైతులందరం అండగా ఉందాం

నాడు కాంగ్రెస్ పాలనలో
వ్యవసాయం అంటే సంక్షోభం.
అన్నదాతల ఆత్మహత్యలతో
అన్నిదిక్కులా కల్లోలం. పెట్టుబడికి
పైసల్లేక అప్పులపాలైన రైతుల
కష్టాలు వర్ణనాతీతం. అందుకే
దేశంలోనే కాకుండా
ప్రపంచంలోనే ఎక్కడా
లేనివిధంగా రైతులకు పెట్టుబడి
సాయం చేసే విప్లవాత్మక
పథకమైన రైతుబంధుకు
ముఖ్యమంత్రి కేసీఆర్ గారు
శ్రీకారం చుట్టారు. ఒక్క మాటలో
చెప్పాలంటే.. వ్యవసాయరంగంలో
నవశకం ఇలాగే కొనసాగాలంటే
మన రైతులోకమంతా ఎల్లవేళలా
కేసీఆర్ గారికి అండగా ఉండాలని
విజ్ఞప్తి చేస్తున్నా.

**- మంత్రి కేటీఆర్**

### లాగోడుకి పైసలు ఇచ్చిన కేసీఆర్‌నే గెలిపిత్తం

నాకు రైతుబంధు ఇచ్చి బాకీలు చేసుడు తప్పిచ్చిండు కేసీఆర్ సారు. నాకు 60ఏండ్లు. నా చిన్నప్పటి నుంచి చూస్తున్న ఇంతవరకు రైతులకు ఎవలు ఏం చేయలేదు. మా దిక్కు కూడా చూడలేదు. కానీ ఏ గడియలో వచ్చిండో కేసీఆర్ సార్ మమ్మల్ని అన్ని రకాలుగా ఆదుకుంటుండు. నాకు రెండు ఎకరాల పొలం ఉన్న. ఎకరానికి ఐదువేల సొప్పున పదివేలు యాసంగి, వానకాలం పంటలకు రూ.10 వేలు బ్యాంక్‌లో వేస్తున్నడు. వాటితో నేను లాగోడు పెట్టి వరి సాగు చేత్తున.. కేసీఆర్ సారు రాకముందు లాగోడికి బాకీలు చేసేటొడిని. ఇప్పుడు ఆ బాధ తప్పింది. ఎలాంటి ఆగంలేకుండా పంటలు పండిస్తున్న.. ఆరు నెలల కితం నా కొడుకు పెండ్లి చేసిన. కేసీఆర్ సార్ ఉంటే మాకు రందీ ఉండదు. మళ్లీ రైతుబంధు పెంచుత అంటుండు. మమ్మల్ని ఇంతకంటే ఎక్కువ ఆదుకునే నాయకుడు ఎవలుండరు. మా సారు మాగ్గావాలె. మాకు సీఎం కేసీఆర్ సారు ఇంటి పెద్దలెక్క అన్ని చూసుకుంటుండు. కారు గుర్తుకు ఓటేసి మళ్లీ కేసీఆర్ సారును ముఖ్యమంత్రి చెత్తాం. మా రైతులందరం ఇట్లే అనుకుంటున్నం.

**- ఇరిగి ఎల్లయ్య, బరిగెలగూడెం (గంభీరావుపేట)**

# ఆశతో రాలేదు.. ఆశయంతో వచ్చా

- ఒక్క అవకాశం ఇవ్వండి.. మరింత అభివృద్ధి చేస్తా
- నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా
- 3 గంటల కరెంట్ కావాలా..? 24గంటలు కావాలా..?
- ప్రజలారా మీరే ఆలోచించాలి
- వట్టెంల, ఫాజుల్‌నగర్, తుర్కాషీనగర్, నమిలిగుండుపల్లి ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు



వట్టెంలలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడను సన్మానిస్తున్న బీఆర్ఎస్, గౌడ సంఘం నాయకులు

వేములవాడ రూరల్, నవంబర్ 14: 'అరవై ఏండ్ల పాలనలో కాంగ్రెస్ ప్రజలకు చేసిందేమీ లేదు.. మూడు గంటల కరెంట్ ఇస్తామంటున్న కాంగ్రెస్ కావాల్నా.. 24గంటల కరెంట్ ఇచ్చే కేసీఆర్ సర్కారు కావాల్నా.. ప్రజలారా మీరే ఆలోచించండి.. తాను ఆశతో రాలేదు.. ఆశయంతో మీ ముందుకు వచ్చిన.. ఒక్కసారి అవకాశం ఇస్తే మీ సమస్యలను పరిష్కరించడంలో ముందుం టా.. అని వేములవాడ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన వేములవాడ రూరల్ మండలం వట్టెంల, ఫాజుల్‌నగర్, తుర్కాషినగర్, నమిలిగుండుపల్లి గ్రామాల్లో ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా చల్మెడ మాట్లాడుతూ, 60ఏండ్లు అధికారంలో ఉండి ఈ ప్రాంతానికి కాంగ్రెస్ చేసిందేమిలేదన్నారు. పోరాడి సా ధించుకున్న రాష్ట్రంలో తొమ్మిదిన్నర ఏండ్లల్లోనే సీఎం కేసీఆర్ సాగునీరు, తాగునీరు అందించారని గుర్తు చేశారు. ఎప్పుడు వచ్చామన్నది ము ఖ్యం కాదని.. ఎంత అభివృద్ధి జరిగిందో ప్రజలు ఆలోచించాలన్నారు. కాంగ్రెస్ పాలనలో తాగు నీటి, కరెంట్ కటకటతోపాటు సాగునీరు లేక పంటలు పండక రైతులు గల్ఫ్ వెళ్లారని గుర్తుచేశారు. ఇప్పుడు 24గంటల కరెంట్, సాగు, తాగునీరు ఉండడంతో స్వగ్రామాలకు వచ్చి సం బురంగా పంటలు పండిస్తున్నారని తెలిపారు. ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత కేసీఆర్‌దేనని స్పష్టం చేశారు. ఇన్నేండ్లు పట్టించుకొని కాంగ్రెస్ పార్టీ ఈ రోజు ఓట్ల కోసం గ్రామా ల్లో తిరుగుతూ సానుభూతి కోసం పాకులాడుతున్నారని విమర్శించారు. కారు గుర్తుకు ఓటేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రి చేయాలన్నారు. కాగా, పలు గ్రామాల్లో చల్మెడకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్‌రెడ్డి, గడ్డం హన్మాండ్లు, ఎంపీపీ బండ మల్లే శం, మం డలాధ్యక్షుడు గోస్కుల రవి, సెస్ డైరెక్టర్ ఆకుల దేవరాజం, సర్పంచులఫోరం మండలాధ్యక్షుడు ఏశ తిరుపతి, ఏఎంసీ వైస్ చైర్మన్ వెల్మ బాల్‌రెడ్డి, సర్పంచులు యామ సుమతి, నాగుల వేణుగోపాల్, షేక్‌రిజ్వానా, చంద్రగిరి లక్ష్మి, ఉపసర్పంచ్ అంజయ్య, నాయకులు యా మ తిరుపతి, షేక్‌పాషా, శ్రీనివాస్, వంశీ, రవీందర్‌రెడ్డి, లక్ష్మణ్, నరేశ్ పాల్గొన్నారు.

# మద్దతు ధరకు వడ్ల కొనుగోలు

పెద్దపల్లి కమాన్, నవంబర్ 14 : రైతులు పండించిన వడ్లను మద్దతు ధరపై కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పెద్దపల్లి మండలం కుర్మపల్లి, పాలకుర్తి మండలం బసంత్‌నగర్, రామారావుపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ పరిశీలించి మాట్లాడారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు, టార్పాలిన్లు, క్లీనర్లు, వేయింగ్ యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు, ఇతర ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రైతులు ధాన్యం నాణ్యతా ప్రమాణాలు పాటించాలని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద, రైస్ మిల్లర్ల వద్ద హమాలీల కొరత రాకుండా జాగ్రత్త వహించాలని అధికారులకు సూచించారు. పరిమితికి లోబడి మాత్రమే వాహనాల్లో ధాన్యం నింపాలని, ఓవర్ కెపాసిటీ కావద్దని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే ట్రక్ షీట్‌లో జనరేట్ చేయాలన్నారు. రైతులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగో లు కేంద్రం వద్ద తప్పనిసరిగా టార్పాలిన్లు అవసరమైన మేరకు ఏర్పాటు చేసి అకాల వర్షాల కారణంగా ధాన్యం నష్టపోకుండా చూడాలన్నారు. ఇక్కడ సివిల్ సప్లై జిల్లా మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ, సంబంధిత అధికారులున్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్